ఈరోజు (17 ఫిబ్రవరి, 2025) విలేకర్ల సమావేశం (విజయవాడలో) జరిగింది. ఆ వివరాలను ప్రచురణార్థం/ ప్రసారర్థం పంపుతున్నాము – జె.జయరాం, ఆఫీసు కార్యదర్శి

**సోలార్, విండ్ విద్యుత్ ఒప్పందాలు రైతులకు, వినియోగదారులకు హానికరం**

**'సెకీ' సహా అన్ని కార్పొరేట్ ఒప్పందాలు రద్దు చేయాలి.**

**సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు**

**రైతులకు ఎకరాకు నెలకు రూ.30వేలు ఇవ్వాలి.**

**ప్రతి సంవత్సరం ఒప్పందాలు పునరుద్దరించాలి**

**ఒప్పంద పత్రాల్లో నిబంధనలు చెల్లవు**

ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లో రైతులతో కార్పొరేట్ కంపెనీలు చేసుకుంటున్న విద్యుత్ ఒప్పందాలు హానికరమని, రైతులు భూములపై హక్కు కోల్పోతారని, వినియోగదారులపై భారం పడుతుందని సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. నేడు బాలోత్సవ భవనంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్నూలు జిల్లాల్లో పెంటగాన్ సినర్జీ సొల్యూషన్స్ కంపెనీ రైతులతో చేసుకున్న ఒప్పంద పత్రంలోని వివరాలను ఆయన వెల్లడించారు. అందులోని నిబంధనల ప్రకారం రైతులు భూములపై హక్కు శాశ్వతంగా కోల్పోతారని, 30 సంవత్సరాలతోపాటు రైతులు వాటిని బిడ్డలకు ఇవ్వలేరని, రుణం తీసుకోలేరని, అటవీ, గిరిజన చట్టాలు వర్తించవని, కంపెనీదే తుది నిర్ణయం అవుతుందని అన్నారు. రైతుల నుండి లీజు పేరుతో తీసుకునే ప్రతి రెండున్నర లేదా మూడు ఎకరాలలో మెగావాట్ కరెంట్ సోలార్ ద్వారా తయారవుతుందని, అదే భూమిలో మరో మెగావాట్ కరెంట్ విండ్ ద్వారా కూడా చేసుకోవచ్చని అంటే 2 మెగావాట్ల కరెంట్ తయారైతే సగటున సంవత్సరానికి దాదాపు 50 కోట్లు ఆదాయం వస్తుందని అంటే ఎకరాకి 20 కోట్లు వస్తే రైతులకు రూ.30 వేలు మాత్రమే ఇస్తారని, ఇంతకన్నా నిలువుదోపిడీ ఏమి ఉంటుందని ప్రశ్నించారు. ఇంత దారుణమైన ఒప్పందాలు జరుగుతున్నా ప్రభుత్వం ఎమీ మాట్లాడడం లేదని, ప్రభుత్వ పాత్ర ఏమిటని, కార్పొరేట్ కంపెనీలు రైతుల్ని మోసం చేస్తుంటే చూస్తూ కార్పొరేట్ కంపెనీలకు కాపలా కాస్తుందా అని ప్రశ్నించారు. మోడీ ఆదేశంపై జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన విధానాన్నే చంద్రబాబు అమలు చేస్తున్నారని అన్నారు. కంపెనీలు మూడు ఎకరాలకు 15–20 కోట్లు పెట్టుబడి పెడుతుందని, సంవత్సరానికి 15–20 లక్షలు మాత్రమే ఖర్చవుతుందని, ఈ లెక్కన 5–6 సంవత్సరాలలో వారి మొత్తం పెట్టుబడి తిరిగి వస్తుందని, ఆ తర్వాత అంతా వారికి 100% లాభమేనని వెల్లడించారు. కానీ వినియోగదారుల నుండి ప్రతి యూనిట్‌కు రూ.2–49పైసలు 25 సంవత్సరాలపాటు వసూలు చేస్తుందని అన్నారు. జనంపై లక్ష 20 వేల కోట్లు అదనపు భారం పడుతుందన్నారు. అటు రైతుల్ని, ఇటు వినియోగదారుల్ని నిలువునా ముంచుతున్నారని, ఈ చట్ట వ్యతిరేక, అక్రమ ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కౌలురైతులు భూయజమానుల నుండి భూమి కౌలుకు తీసుకుంటే 11 నెలలకే ఉండే విధంగా చట్టం చేశారని, అదే సోలార్ పవర్‌కు కార్పొరేట్ కంపెనీలు 30 సంవత్సరాలు ఒప్పందాలు ఒకేసారి ఎలా చేసుకుంటాయని ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం లీజు రెన్యూవల్ చేయాలని, ఎకరాకు నెలకు రూ. 30 వేలు లీజు ఇవ్వాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ భూములపై ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కార్మికులకు కూడా ప్రతి సంవత్సరం పరిహారం చెల్లించాలి.

**అమెరికాకు దేశాన్ని తాకట్టు పెట్టిన మోడీ**

అమెరికా పర్యటనకు ముందు అదానీ కేసు విచారణ జరక్కుండా ట్రంప్ చేత చట్టసవరణ చేయించి గిఫ్ట్ పొందిన మోడీ రిటన్ గిఫ్ట్ క్రింద ఎఫ్–35 విమానాలు, ఆయిల్, గ్యాస్ అమెరికా నుండి కొనుగోలు చేసి వారికి లబ్ది చేకూరుస్తున్నారని, దీనివల్ల అమెరికా వాణిజ్యలోటు తగ్గుతుందని, మన దేశంపై భారం పడుతోందని వి.శ్రీనివాసరావు అన్నారు. ఇప్పటికే మనం తక్కువ రేటుకి రూపాయిల్లో రష్యా, ఇరాన్ నుండి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తున్నామని, ఇప్పుడు దాన్ని ఆపి అమెరికా నుండి కొనుగోలు చేయడం నష్టం అన్నారు. ఎఫ్–35 యుద్ద విమానాలకు కాలం చెల్లిందని ఏడాది క్రితమే మస్క్ చెప్పారని వాటిని ఎలా కొనుగోలు చేస్తామని ప్రశ్నించారు. కాలం చెల్లిన ఆయుధాలు కొని అమెరికాకు లాభం చేకూర్చేలా చూస్తున్నారు. మరోవైపు అదే అమెరికా మన దేశ పౌరులకు వీసాల్లేవని బేడీలు వేసి అవమానంగా విమానాల్లో పంపిస్తుంటే నోరు మెదపడం లేదని, ఇది భారతీయ ఆత్మగౌరవాన్ని అమెరికాకు తాకట్టు పెట్టడమేనన్నారు. అమెరికా ఎంబసీకి నిరసన తెలపాలని డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు పార్టీలు దూరంగా ఉండాలి

ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలను టీచర్లు, విద్యావంతులకు వదిలేయాలని శ్రీనివాసరావు రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికలలో వైసిపి పోటీ చేయకుండా పిడిఎఫ్‌ను బలపరుస్తుందని ఒక విలేకరి ప్రస్తావించగా వైసిపి పోటీ చేయకపోవడం మంచిదేనని అదే విధంగా టిడిపి కూటమి కూడా పోటీ చేయకుండా ఉండాల్సిందన్నారు. విద్యావంతుల, టీచర్ల హక్కును హైజాక్ చేయొద్దని శాసనమండలిలో వారి గొంతు వినపడకుండా చేయడానికే టిడిపి పోటీ చేస్తున్నదని, పిడిఎఫ్ టీచర్లు, విద్యావంతుల తరపున నిలబడుతున్నదని చెప్పారు.

## సచివాలయ ఉద్యోగులకు అండగా ఉంటాం

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను క్రమబద్ధీకరించే అంశంపై మాట్లాడుతూ వారిని తొలగించినా, వేధించినా చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. వలంటీర్లకు జీతం రూ.10వేలు ఇస్తామని వాగ్దానం చేసిన టిడిపి ఇప్పుడు ఏకంగా వారిని తొలగిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మాట తప్పి మోసం చేయడం సరికాదన్నారు.

## ప్రజల అప్పు ఎవరు తీరుస్తారు?

ప్రభుత్వం అప్పుల్లో ఉందని, సంక్షేమ పథకాలు అమలు చేయలేమని చంద్రబాబు అంటున్నారని ఒక విలేకరి ప్రశ్నించగా ప్రజలు అప్పుల్లో ఉన్నారని వాటిని ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు. రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోవడం కన్పించడం లేదా అన్నారు. ప్రజలపై భారం వేస్తే ప్రతిఘటిస్తామన్నారు.

రానున్న బడ్జెట్‌లో కేటాయింపులు చూశాక విద్యుత్ చార్జీల తగ్గింపు కోసం కార్యాచరణ రూపొందిస్తామన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని, అదానీకోసం జరిగిన సెకీ ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణా, తమిళనాడు ప్రభుత్వాలు అదానీ ఒప్పందాలు రద్దు చేసుకున్నాయని తాజాగా శ్రీలంక అదానీ ఒప్పందాన్ని సమీక్షించడంతో అదానీ కంపెనీ వెనక్కి వచ్చేసిందని, చంద్రబాబు ప్రభుత్వం దాన్ని ఎందుకు కొనసాగిస్తున్నదని ప్రశ్నించారు. వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్లు పెట్టడం లేదంటూనే షిర్డిసాయి కంపెనీకి నిర్వహణ ఖర్చులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు.

పవన్‌కళ్యాణ్ గుడుల దర్శనంపై స్పందిస్తూ అది ఆయన వ్యక్తిగత కార్యక్రమమని, కానీ మతం పేరుతో విద్వేషాలు పెంచడాన్ని ఆయన వ్యతిరేకించారు. పవన్ చర్యలు, మాటలు ఆర్‌ఎస్‌ఎస్‌కు తోడ్పడుతున్నాయని, మత సామరస్యానికి భంగమని అన్నారు. చిలుకూరు బాలాజీ పూజారి రంగరాజన్‌పై దాడి జరిగితే సిపిఎం స్పందించి ఆయన్ను కలిసి సంఘీబావం తెలిపిందని, కానీ పవన్ ఎందుకు వెళ్ళి మద్దతు ప్రకటించలేదని ప్రశ్నించారు. ఆయనకు హిందుమతంపై కన్నా ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాద సిద్దాంతంపై విశ్వాసమని విమర్శించారు.

= = = =